RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే QUICK TODAY

ఆదివారం 27 అక్టోబర్ 2024

quicktodaynews.com



## చేర్యాల మండలంలో దారుణ ఘటన

### అవమానం భరించలేక విద్యార్థి ఆత్మహత్య

**చేర్యాల, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** నలుగురిలో అవమానం భరించలేక ఓ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనచేర్యాల మండలంలో కలకలం రేపింది. కాపీ కొట్టావంటూ ప్రిన్సిపల్ కొట్టడంతో బాధపడుతున్న ఆ విద్యార్థిని...తండ్రికూడా అవమానించాడు. దీంతో ట్టుకోలేక ఉరేసుకున్నాడు. ప్రిన్సిప్రాల్ కొట్టాడని తండ్రికి చెప్పగా.. అతను వచ్చి తోటి విద్యార్థుల ముందు తనను కొట్టాడని భరించలేని ఆ విద్యార్థి తీవ్ర మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శభాష్ గూడెం గ్రామానికి చెందిన 13 ఏళ్ల విద్యార్థి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలలో జరిగిన ఓ పరీక్షలో కాపీ కొడుతున్న విద్యార్థిని గమనించిన ప్రిన్సిపాల్ అతన్ని కొట్టడంతోపాటు తండ్రికి ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ విద్యార్థి తండ్రి పాఠశాలకు వచ్చి తోటి విద్యార్థుల ఎదుట కొడుకును కొట్టాడు. ప్రిన్సిపల్‌తోపాటు తండ్రి కూడా చేయిచేసుకోవడాన్ని జీర్ణించుకోలేని ఆ విద్యార్థి.. శనివారం ఉదయం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద ఉన్న చెట్టువద్దకు వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కొమురవెల్లి ఎస్సై రాజు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపులు

**తిరుపతి, అక్టోబర్ 26 (క్విక్ టుడే న్యూస్):** తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజ్ పార్క్, వైస్రాయ్ హోటల్ సహా మరో రెండు ప్రాంతాలకు తాజాగా బాంబు బెదిరింపుల మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో ఆయా హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఎక్కడా పేలుడు పదార్థాలు దొరకలేదు. దీంతో వాటిని ఫేక్ మెయిల్స్‌గా పోలీసులు నిర్ధారించారు. అనంతరం ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతిలో నాలుగు రోజుల క్రితం కూడా ఈ నాలుగు హోటళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు చేపట్టారు. అప్పుడు కూడా ఫేక్ మెయిల్స్‌గా నిర్ధారించారు. దీనిపై రెండు కేసులు నమోదు చేశారు.

## ఐఏఎస్ అమోయ్ కుమార్ లీలలు

### ఈడీ ముందుకు శంకర్‌హిల్స్ బాధితులు

**హైదరాబాద్, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** సీనియర్ ఐఏస్ అధికారి అమోయ్ కుమార్‌పై ఫిర్యాదు చేసేందుకు బాధితులు ఈడీ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఈడీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకొని అక్రమాలకు పాల్పడ్డారని, 200 ఎకరాలు అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఎ÷-లాట్లను ఎకరాల్లోకి మార్చి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు చేశారని, రాత్రికి రాత్రే పత్రాలు సృష్టించారని వాపోయారు. 40 ఏళ్లుగా పొజిషన్‌లో ఉన్నా.. పోలీసు బలగాలతో వెళ్లగొట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు.సర్వే నెంబరు 111 నుంచి 179 వరకు 460 ఎకరాల భూమి ఉంది. శంకర్‌హిల్స్‌లో సుమారు 3,300 మంది ఎ÷-లాట్ ఓనర్స్ ఉన్నారు. నిందితులు దాదాపు రూ.30వేల కోట్ల భూ కుంభకోణానికి పాల్పడ్డారు. మాకు జరిగిన అన్యాయంపై ఈడీకి ఫిర్యాదు చేశాం. ఐఏఎస్ అమోయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, పెద్దల పాత్రపై దర్యాప్తు జరపాలి' అని బాధితులు ఈడీ అధికారులను కోరారు.

## మూసీ బ్యూటిఫికేషన్ కల్ల

### డబ్బుల కోసమే రేవంత్ యత్నం.. మరోమారు ఈటల విమర్శలు

**హైదరాబాద్, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డి మూసీ బ్యూటిఫికేషన్ చేస్తాననేది కేవలం డబ్బు సంచులు నింపుకోవడానికేనని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మరోమారు ఆరోపించారు. ఇప్పటివరకు నిర్మించిన మురుగు శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ)లను ప్రారంభించే తెలివి సీఎంకు లేదని దుయ్యబట్టారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని టీకేఆర్ కాలనీలో మూసీ పరివాహక ప్రాంతాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పరిశీలించారు. ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న ఈటల.. ప్రజల దృష్టి మళ్లించేందుకే హైడ్రా, మూసీ పేరుతో కొత్త నాటకాలకు తెర లేపారన్నారు. పేదలకు అన్యాయం చేసి పెట్టుబడిదారులకు వత్తాసు పలకడం సీఎం రేవంత్ రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిజస్వరూపం తెలిసేందుకు ఆరేళ్లు పడితే.., రేవంత్ దుర్బుద్ధి ఆరు నెలల్లోనే బయట పడిందన్నారు. ఇష్టారీతిన వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పాలనకు మంచి రోజులు ముగిశాయన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదన్నారు. మూసీలో విషపదార్థాలు, రసాయనాలు చేరకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఫిబ్రవరి 12నుంచి మేడారం మినీ జాతర

**ములుగు, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** దక్షిణభారత కుంభమేళాగా ఖ్యాతిగాంచిన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మల మినీ జాతర తేదీలు ఖరారయ్యాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12 నుంచి నాలుగు రోజులపాటు ఈ మినీ జాతర జరగనుంది. రెండేళ్లకోసారి మేడారం మహా జాతర జరుగుతుండగా.. అధిక సంఖ్యలో భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. వనంలో కొలువైన వనదేవతలు జనం మధ్యకు రావడంతో అడవి అంతా జనసంద్రమవుతుంది. మహా జాతర జరిగిన మరుసటి సంవత్సరం చిన్న జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇవాళ సమావేశమైన పూజారులు.. మినీ జాతర తేదీలను ప్రకటించారు.

### బాపట్ల మాజీ ఎంపీ

## నందిగం సురేశ్‌పై మరో కేసు

**బాపట్ల, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు నమోదైంది. మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై గతేడాది దాడికి సంబంధించి నందిగం సురేశ్‌పై తుళ్లూరు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బోరుగడ్డ అనిల్ కుమార్ పేరును కూడా ఈ కేసులో చేర్చారు. ఇందులో ఏ1గా నందిగం సురేశ్, ఏ2గా బోరుగడ్డ అనిల్ పేర్లు ఉన్నాయి. గత ఏడాది మార్చి 31న అమరావతి ఉద్యమంలో భాగంగా రాజధాని గ్రామమైన మందడంలో నిర్వహించిన సమావేశానికి సత్యకుమార్ యాదవ్, మరికొందరు నేతలు వచ్చారు. తిరిగి వెళ్తున్న సమయంలో మూడు రాజధానుల శిబిరం వద్ద అప్పటి బాపట్ల ఎంపీ నందిగం సురేశ్, వైసీపీ నాయకుడు బోరుగడ్డ అనిల్ అడ్డుకున్నారు. తమ అనుచరులతో కలిసి ఇసుప రాడ్లు, రాళ్లతో దాడి చేశారు. ఈ సమయంలో నందిగం సురేశ్ తన అనుచరులను రెచ్చగొట్టినట్లు బీజేపీ యువజన నాయకుడు సురేశ్ తెలిపారు. అయితే అప్పుడు వైసీపీ ప్రభుత్వం ఉండటంతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నాడు మళ్లీ ఫిర్యాదు చేశామని చెప్పారు.

## శింగనమలలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఆరుగురు దుర్మరణం

**అనంతపురం, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** అనంతపురం జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద లారీని కారు ఢీకొంది. టైరు పగిలి అదుపుతప్పిన కారు.. ఎదురుగా వస్తున్న లారీనీ ఢీకొట్టడంతో నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులోని ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరంతా తాడిపత్రిలో నగర కీర్తన వేడుకలో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా అనంతపురానికి చెందిన సంతోష్, షణ్ముక్, వెంకన్న, శ్రీధర్, ప్రసన్న, వెంకీగా గుర్తించారు.

# తల్లిని కోర్టుకు ఈడ్చే కొడుకు ఉంటాడా..?

వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి

ఆస్తులకు వారి పేర్లు పెట్టుకుంటే వారివే అవుతాయా?

మేము ఆనాడు అభ్యంతరం చెప్పలేదు కనుకే పేర్లు వచ్చాయి

ఇది ఘర్ ఘర్‌కీ కహానీ ఎలా అవుతుంది

మీడియా సమావేశంలో షర్మిల కన్నీటి పర్యంతం



**విజయవాడ, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. అన్ని కుటుంబాల్లో ఉంటే వ్యవహారం అంటూ తమఆస్తులపై జగన్ చేసిన వ్యాఖ్యలపై షర్మిల మండిపడ్డారు. తల్లిపై కేసులు పెట్టి కోర్టుకు లాగడం ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమోషన్‌కు గురైన షర్మిల కన్నీటి పర్యంత అయ్యారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సుబ్బారెడ్డి వ్యాఖ్యపై స్పందించారు. 'న బిడ్డలు కూడా మీ కళ్ల ముందే పెరిగారు.. వారికి అన్యాయం చేయాలని ఎలా అనిపించింది. అన్ని విషయాలు తెలిసి కూడా బాబాయి ఎందుకిలా మాట్లాడుతున్నారు' అని కన్నీటి పర్యంతమయ్యారు. జగన్ పదవులు ఇస్తే సుబ్బారెడ్డి అనుభవిస్తున్నారు.. ఆయన అలా మాట్లాడకపోతే ఇంకెలా మాట్లాడుతారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు ఆర్థికంగా లాభపడ్డారు. సుబ్బారెడ్డే కాదు.. సాయిరెడ్డి కూడా అలాగే మాట్లాడొచ్చు. ఎందుకంటే ఆయన కూడా వాళ్ల టీమ్‌లోనే ఉన్నారు. జగన్ పక్కన వాళ్లు ఉన్నారని తెలిసి కూడా నిన్న రాసిన లేఖలో వాళ్ల పేర్లు ప్రస్తావించాను. నేను చెబుతున్నది నిజమని ప్రమాణం చేయగలను. సుబ్బారెడ్డి చెబుతున్నది కూడా నిజమని ఆయన ప్రమాణం చేయగలరా? నలుగురు మనవళ్లకు ఆస్తిలో సమాన వాటా అని రాజశేఖర్‌రెడ్డి బ్రతికుండగానే చెప్పారు. ఇది నిజం.. నా బిడ్డలమీద ప్రమాణం చేసి చెబుతున్నా. ఇది నిజం కాదని.. సుబ్బారెడ్డి, జగన్ ఇద్దరూ వారి బిడ్డలపై ప్రమాణం చేసి చెప్పగలరా? నాకు రావాల్సిన ఆస్తిలో వాటా ఇవ్వకుండా ఏవో చెబితే ఎలా? నా మేలు కోరతానని వైఎస్‌కు జగన్ మాట ఇచ్చారు. సాక్షిలో, భారతి సిమెంట్స్‌లో వాటాలు మావని జగన్ ఎలా చెబుతారు? కంపెనీలకు భారతి, జగతి అని వాళ్ల పేర్లు పెట్టుకున్నారట. ఆరోజు ఆ పేర్లు పెట్టుకోగలిగారంటే కారణం.. రాజశేఖర్‌రెడ్డి అనుమతిచ్చారు, నేను అడ్డు చెప్పలేదు కాబట్టే. పేర్లు పెట్టుకున్నంత మాత్రాన ఆస్తులు మొత్తం వారివే అనే రూల్ ఏమైనా ఉందా? ఆస్తులు మొత్తం జగన్‌వే కాబట్టి ఆయన జైలుకు వెళ్లారని సుబ్బారెడ్డి చెబుతున్నారు. భారతి పేరు మీద ఆస్తులు ఉంటే ఆమె ఎందుకు జైలుకు వెళ్లలేదు? ఎవరైనా గిఫ్ట్ ఇస్తే ఎంవోయూ రాసుకుంటారా? మీరు ఎంవోయూ రాశారంటేనే ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అర్థం. దీనికి సుబ్బారెడ్డి సమాధానం చెప్పాలి. కన్నతల్లిపై కేసు వేసిన వ్యక్తి ఈ లోకంలో ఎవరైనా ఉన్నారా? సొంత కుమారుడే తల్లిని కోర్టుకు లాగడం దారుణం కాదా? రాజశేఖర్‌రెడ్డి పేరు ఎఫ్ఐఆర్‌లో లేకపోతే.. కేసు నుంచి జగన్ బయటపడటం అసాధ్యమని భావించి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మూడు కోర్టుల చుట్టూ తిరిగి రాజశేఖర్‌రెడ్డి పేరును సీబీఐ ఎఫ్ఐఆర్‌లో చేర్పించారు. తనకు లాభం జరుగుతుందనుకుంటే ఎంతటివారినైనా జగన్ అణచివేస్తారు. విజయమ్మను కోర్టుకు లాగడానికి కారణం ఎవరు? మీ నాయకుడు ఎలాంటి వాడో వైకాపా శ్రేణులు ఆలోచించాలి. జగన్ లాంటి వ్యక్తి నాయకుడో.. శాడిస్టో వైకాపా నేతలు అర్థం చేసుకోవాలి. నేనేం తప్పు చేశానో చెప్పాలని వైకాపా నేతలు, కార్యకర్తల్ని అడుగుతున్నా అని షర్మిల అన్నారు.

# కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వైసీపీ కుట్ర

టీడీపీ పనైపోయిందన్న వారే కనుమరుగు అయ్యారు

ఎక్కడ ఇసుక దందా జరిగినా తిరుగుబాటు చేయండి

రాజకీయంగానే ముందుకు వెలుదాం.. కార్యకర్తలకు న్యాయం చేస్తా

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు



**అమరావతి, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా వైసీపీ నేతలు కుట్ర పన్నుతున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలోకి వైసీపీ నేతలు చొరబడ్డారని విమర్శించారు. ఎక్కడ ఇసుక దందా జరుగుతున్నా తిరుగుబాటు చేయండి, తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. మద్యం ఎమ్మార్పీ ధరపై ఒక్క రూపాయి కూడా ఎక్కువ చెల్లించవద్దని మందుబాబులను కోరారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో సీఎం చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీపై, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎస్టీతో కలిపి రూ.97 లు అయ్యే సినరేజ్ ఛార్జీకి రూ.35లకే టెండర్ వేస్తామంటూ వైసీపీ నేతలు వచ్చారని అన్నారు. ఇసుక కొరత సృష్టించి బ్లాక్‌మార్కెటింగ్ చేసి తమ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే అతి తక్కువ ధరకు టెండర్లు వేశారని చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా, ఉచిత ఇసుక స్ఫూర్తి దెబ్బతినకూడదనే సినరేజ్ ఛార్జీలు, జీఎస్టీ కూడా ఎత్తి వేశామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.నేను 1995 సీఎంనే.. కానీ 2014 సీఎంను కాదు. ఈసారి ఖచ్చితంగా రాజకీయ పరిపాలనే చేస్తా. విశ్వసనీయతను నిలబెట్టుకుంటూ రాజకీయ ముసుగులో తప్పు చేసిన వారిని ఉపేక్షించేది లేదు. ముఖ్యమంత్రి అయ్యాక పార్టీ వ్యవహారాలు పట్టించు కోవట్లేదని కేడర్ నుంచి వస్తున్న విమర్శలు అర్థం చేసుకోగలను. జగన్ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ రూ.10లక్షల కోట్లకు పైగా అప్పు భారం మోస్తున్నామనే విషయం గ్రహించాలి. మనం ఓ విషవలయంలో ఉన్నామని గుర్తించాలి. దీనిని పరిష్కరించేందుకు కొంత సమయం అవసరం. ఇప్పటికే చాలా వ్యవస్థలను గాడిలో పెట్టాం. మొన్నటి ఎన్నికల్లో రాక్షసుడితో యుద్ధం చేశాం. వైసీపీ నేతల వల్ల నష్టపోయిన కార్యకర్తలను ఆదుకుంటూనే, ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చాలి. జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా పెట్టిన తప్పుడు కేసులకు చట్ట పద్ధతిలోనే పరిష్కరిస్తా. ఎవ్వరూ తొందరపడొద్దు. ఎక్కువ అంచనాలు పెట్టేసుకుని ఎవ్వరూ నిరుత్సాహపడొద్దు. రాజకీయాల్లో ఎన్ని మార్పులు, సంస్కరణలు వచ్చినా, మూల సిద్ధాంతం ప్రజాసేవని మరవద్దని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అనేక మంది నాయకులను తయారు చేసిన పార్టీ తెదేపా అని ఆ పార్టీ చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళగిరిలో ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. రాజకీయ విశ్వవిద్యాలయం తెలుగు దేశం పార్టీ. నేటి తరం చాలా మంది తెలుగు రాజకీయ నాయకుల మూలాలు తెదేపాలోనే ఉన్నాయి. రాజకీయ కార్యకర్తల కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కార్యకర్తలను నాయకులుగా తయారు చేసేందుకు అనునిత్యం పనిచేస్తున్నాం. వారి సంక్షేమం కోసం ముందుకెళ్లాం. రాజకీయ కక్షలకు బలైన సంఘటనలు చాలా చూశాం. అనేక కారణాలతో కార్యకర్తలు చనిపోయారు. వారి కుటుంబాలను ఆదుకుంటున్నాం అని అన్నారు. తెదేపా పనైపోయిందన్న వాళ్ల పనైపోయింది. పార్టీయే శాశ్వతం. తెదేపాకు ముందు.. ఆ తర్వాత అన్నట్లు తెలుగుజాతికి గుర్తింపు వచ్చింది. కార్యకర్తల మనోభావాలు గౌరవించే పార్టీ తెదేపా. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ప్రమాద బీమా పెట్టిన పార్టీ

## గుస్సాడీ గురువు కనకరాజు మృతి

### ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

### సంతాపం తెలిపిన ప్రధాని మోడీ, సీఎం రేవంత్

**హైదరాబాద్, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** గుస్సాడీ నృత్యాన్ని విస్తృత పరిచిన 94ఏళ్ల పద్మశ్రీ కనకరాజు కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. గిరిజన బిడ్డల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గుస్సాడీ నృత్యంతో కనకరాజు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సొంతూరు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామం. ఆయన గత కొంత కాలంగా అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అనేక ఆసుపత్రుల్లో చూపించిన ప్రయోజనం లేకపోయింది. గుస్సాడీ నృత్యాన్ని కాపాడుతూ వచ్చిన వ్యక్తిగా పేరు ఉన్న కనకరాజుకు కేంద్ర ప్రభుత్వం 2021లో ప్రకటించింది. అప్పటి రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును నవంబర్ 9న అందుకున్నారు. వందల మంది యువకులు ఆయన వద్ద గుస్సాడీ నృత్యం నేర్చుకొని శిష్యులుగా మారారు. గిరిజన బిడ్డలకు ఎంతో ఇష్టమైన గుస్సాడీ నృత్యానికి వన్నె తేవడమే కాకుండా పద్మశ్రీ అందుకొని తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచిన కనకరాజు మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు చేస్తామని ప్రకటించారు. గుస్సాడీ కళాకారుడు కనకరాజు మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికారిక లాంఛనాలతో శనివారం అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. కనకరాజు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. గుస్సాడీ నృత్యం కోసం ఆయన చేసిన సేవలు మరవలేనివన్నారు. కనకరాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## నాలుగు గంటల్లోనే హైదరాబాద్ టు విశాఖపట్నం

**విశాఖపట్నం, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే ఎంత సమయం పడుతుంది? సాధారణ రైళ్లలో వెళ్తే 12 గంటలు.. అదే వందేభారత్ రైలులో అయితే 8.30 గంటల్లోనే వెళ్లొచ్చు. కానీ అదే నాలుగు గంటల్లోనే హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లగలిగితే ఎలా ఉంటుంది.. అతి త్వరలోనే ఆ కోరిక తీరబోతుంది. హైదరాబాద్ నుంచి వైజాగ్ మధ్య రైలు ప్రయాణ సమయాన్ని తగ్గించే ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళిక కీలక దశకు చేరుకుంది. ఈ మేరకు శంషాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య సెమీ హైస్పీడ్ రైలు కారిడార్ ఎలైన్‌మెంట్ ఖరారైంది. సికింద్రాబాద్ నుంచి వైజాగ్‌కు ప్రస్తుతం రెండు మార్గాల్లో రైళ్లు వెళ్తున్నాయి. మొదటిది వరంగల్-ఖమ్మం-విజయవాడ మార్గం. రెండోది నల్గొండ-గుంటూరు-విజయవాడ. ఈ రెండు మార్గాల్లో గంటకు 110 నుంచి 130 కి.మీ. వేగంతో రైళు ప్రయాణిస్తున్నాయి. కానీ గంటకు 220కి.మీ. వేగంతో రైల్లు ప్రయాణించేలా ఇప్పుడు కొత్త మార్గాలను రైల్వే శాఖ ప్రతిపాదించింది. ఇందులో ఒకటి హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిని అనుకుని ఉన్నట్లుగానే ఉంటుంది. దీన్ని సూర్యాపేట, విజయవాడ మీదుగా మొదటి మార్గాన్ని ప్రతిపాదించింది. ఇందులో భాగంగా వైజాగ్ నుంచి విజయవాడ, సూర్యాపేట మీదుగా కర్నూలుకు మరో కారిడార్‌ను నిర్మించనున్నారు. ఇది వైజాగ్ నుంచి మొదలై సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూలు మీదుగా కర్నూలు చేరుతుంది. వీటి

### ధరల నియంత్రణపై

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

### మార్కెట్ ఇంటర్వెన్షన్లపై మంత్రుల కమిటీని ఏర్పాటు చేసిన సర్కార్

**అమరావతి, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** ధరల నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై మంత్రుల కమిటీని సర్కార్ ఏర్పాటు చేసింది. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో మంత్రుల కమిటీ ఏర్పాటైంది. కమిటీలో సభ్యులుగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాల శాఖ ఎక్స్అఫీషియో కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వం పేర్కొంది. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకస్మికంగా ఎందుకు పెరుగుతున్నాయన్న అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. నిత్యావసరాలు, కూరగాయల ధరల తగ్గింపునకు చేపట్టాల్సిన చర్యలపైనా సిఫార్సులు చేయాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. ఉత్పత్తి, సప్లై, డిమాండ్ , ధరలకు సంబంధించిన అంశాలు, పంటల తీరు, ఎగుమతులు, దిగుమతులపై కూడా అధ్యయనం చేయాల్సిందిగా ఆదేశించింది. వినియోగదారులకు అందుబాటు ధరల్లో నిత్యావసరాలు, కూరగాయలు లభించేలా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని తెలిపింది. ధరలు నియంత్రణలోకి తెచ్చేందుకు అవసరమైన యంత్రాంగం రూపకల్పనకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఈ అంశాలపై ఓ డేటా బేస్‌ను ఏర్పాటు చేయాలని ఆర్డర్స్ వేసింది. ధరలు పెరిగినప్పుడు మార్కెట్ ఇంటర్వెన్షన్‌ను అమలు చేసేలా శాశ్వత ప్రాతిపదికన ధరల నియంత్రణ నిధిని ఏర్పాటు చేసేందుకు సూచనలు ఇవ్వాలని వెల్లడించింది. ధరల పెరుగుదల , నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై అధికారుల కమిటీ ఇచ్చిన సిఫార్సులను అధ్యయనం చేయాలని సూచించింది. ఆహార పంటలు, నిత్యావసరాలకు సంబంధించి ఉత్పత్తి, సరఫరా, నిల్వలకు సంబంధించి దీర్ఘ, స్వల్పకాలిక ప్రణాళికల అమలుపైనా ప్రభుత్వం సిఫార్సులు కోరింది. ఉత్పత్తి, నిల్వల్లో ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా ఏడాది పొడవునా ధరల్ని నియంత్రణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయదారులు, మిల్లర్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ , ఆహారధాన్యాలు, పప్పు దినుసులు, వంటనూనె డీలర్లు, ఎగుమతి, దిగుమతిదార్లతో సమావేశం కావాలని ఆదేశించింది. అధ్యయనం అనంతరం తదుపరి నిర్ణయం కోసం సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రుల కమిటీకి ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ప్రాణహిత నదిలో ముగ్గురు గల్లంతు

**ఆసిఫాబాద్, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాణహిత నదిలో ముగ్గురు గల్లంతయ్యారు. బెజ్జూరు మండలం గోల్కొండ గ్రామానికి చెందిన జహీర్ హుస్సేన్ (24), ఇర్షాద్ (20), మోసిద్ (22), కాజీమ్ అనే యువకులు శనివారం బెజ్జూర్ మండల కేంద్రంలో బంద్ ఉండటంతో సరదాగా బెజ్జూర్ మండలం ఎర్రబండ రేవు వద్ద ప్రాణహిత నదిలో ఈత కొట్టేందుకు వెళ్లి గల్లంతయ్యారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో బెజ్జూర్ ఎస్సై విక్రమ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. యువకుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

CINEMA

QUICK TODAY
quicktodaynews.com

ఆదివారం 27 అక్టోబర్ 2024





# మీకేంటీ బాధ

## బాడీ షేమింగ్‌పై మండిపడ్డ అలియాభట్

బాడీ షేమింగ్ ఫిల్మ్ ఇండస్ట్రీకి కొత్తేమీ కాదు. తరచూ ఎవరో ఒకరి మీద బాడీ షేమింగ్ కామెంట్స్ వస్తూనే ఉంటాయి. తాజాగా బాలీవుడ్ క్యూటీ ఆలియాభట్ ఈ సమస్యను ఎదుర్కొంటోంది. ఆమెకు కాస్మోటిక్ సర్జరీ ఫెయిల్ అయిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ మధ్యన ఆమె నవ్వితే మూతి వంకర పోతుందని కొన్ని కామెంట్లు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఆమె మాట్లాడుతున్నప్పుడు కూడా ముఖం తేడాగా కనిపిస్తోందని కొంతమంది విమర్శలు చేస్తున్నారు. సోషల్ వీడియాలో తనను ట్రోల్ చేస్తున్న వారిపై ఆలియా మండిపడ్డారు. తన లుక్స్ గురించి కామెంట్ చేస్తున్న వారి కోసం ఆలియా ఓ పోస్ట్ పెట్టింది. “కాస్మెటిక్ కరెక్షన్ లేదా సర్జరీ చేయించుకునే ఎవరి గురించి మాట్లాడను, జడ్జ్ చేయను. మీ శరీరం, మీ ఇష్టం. కానీ దీనిపై నడుస్తున్న ట్రోలింగ్ హాస్యాస్పదంగా ఉంది. నేను చేయించుకున్న బొటాక్స్ ఫెయిల్ అయిందంటూ వీడియోలు వైరల్ అవుతున్నాయి. మీ అభిప్రాయం ప్రకారం, నేను వంకరగా నవ్వుతాను, మాట్లాడినప్పుడు వింతగా ఉంటాను. నా ముఖం ఒకవైపు పక్షవాతానికి గురైందని మాట్లాడుతున్నారు. ఎలాంటి ఆధారాల్లేకుండా ఇలాంటి వీడియోలు ఎలా చేస్తారు. ఇలాంటి కామెంట్స్ చేసేటప్పుడు దానికి వెనక ఏముంది. అసలేం జరిగింది అన్నది తెలుసుకోరా? ప్రతి వ్యక్తికి కొన్ని ఇష్టాలు, నిర్ణయాలు, సొంత ఛాయిస్‌లు ఉంటాయి. వాళ్లకు నచ్చినట్లు జీవితాన్ని సాగిస్తుంటారు. వాళ్ల వ్యక్తిగత జీవితంలోకి వెళ్లి భూతద్దం పెట్టి చూడటం 100 శాతం తప్పే. ఇతరుల వ్యక్తిగత జీవితాల గురించి మీకు ఎందుకు? అంటూ మండిపడింది. తాజాగా ఆమె నటించిన ‘జిగ్రా’ చిత్రం విడుదలైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా అంతంత మాత్రంగా ప్రేక్షకాదరణ పొందింది.



# ప్రపంచవ్యాప్తంగా 11,500 స్క్రీన్స్‌లో పుష్ప2

ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం ‘పుష్ప: ది రూల్’ సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదల రోజే ఈ సినిమా రికార్డులు సృష్టించనుంది. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 11,500 స్క్రీన్స్ లో విడుదల చేయనున్నారు. తాజాగా ఈ విషయానికన మేకర్స్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఆరు భాషల్లో 11,500 స్క్రీన్స్ లో దీన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు భారీగా ప్లాన్ చేస్తున్నట్లు చెప్పారు. ఇండియాలో 6,500.. ఓవర్సీస్‌లో 5000 స్క్రీన్స్ లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటివరకు ఏ ఇండియన్ సినిమా ఈ స్థాయిలో విడుదల కాలేదని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో బిగ్గెస్ట్ రిలీజ్ ఇండియన్ సినిమాగా ‘పుష్ప2’ రికార్డు సృష్టించనుండడం ఖాయమేనని అంటున్నారు. ఈ చిత్రం కలెక్షన్లలోనూ సరికొత్త రికార్డులు తన ఖాతాలో వేసుకుంటుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. దీంతో ఫ్యాన్ ఆనందంలో మునిగి తేలుతున్నారు. అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్నా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఈ సినిమాను నవీన్ ఎర్నేని, రవి శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# హాలీవుడ్ హీరోలకు ధీటుగా మహేష్ బాబు

## రూ.1500 కోట్ల భారీ బడ్జెట్‌తో సినిమా

దర్శక ధీరుడు రాజమౌళి ప్రస్తుతం మహేష్ బాబును హీరోగా పెట్టి పాన్ వరల్డ్ సినిమా తీయబోతున్నారు. దుర్గా ఆర్ట్స్ పతాకంపై డాక్టర్ కె.ఎల్.నారాయణ, ఎస్.గోపాల్ రెడ్డి దీన్ని రూ.1500 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. హాలీవుడ్ సినిమాలను తలదన్నే రీతిలో రాజమౌళి ఈ సినిమాను తీయనున్నట్లు చెబుతున్నారు. అందుకే మహేష్ బాబును హాలీవుడ్ హీరోలకన్నా ధీటుగా తయారుచేస్తున్నారు. దీనిపై ఇప్పటికే మహేష్ బాబు శిక్షణ తీసుకున్నాడు. ప్రస్తుతం రాజమౌళి ఏఐ నేర్చుకుంటున్నారు. తాను నేర్చుకుంటున్న విషయాలను తన టీంతో పంచుకుంటున్నారు. ఆ రెండు సినిమాలు బాగా నచ్చాయి ఏ దర్శకుడికైనా ఒక హీరోకు సంబంధించిన సినిమాల్లో అన్నీ నచ్చాలనే నిబంధన లేదు. కొన్ని సినిమాలు కచ్చితంగా నచ్చుతాయి. అలా రాజమౌళికి మహేష్ బాబు సినిమాల్లో బాగా నచ్చినవి రెండు ఉన్నాయి. అవి ఒక్కడు, పోకిరి. ఈ రెండు సినిమాల్లో మహేష్ బాబు తనను తాను కొత్తగా చూపించుకున్నారని, ఈ సినిమాల్లో కొత్తగా కనిపించాడని ఓ ఇంటర్వ్యూలో రాజమౌళి చెప్పారు. వీటిల్లో సరికొత్త మహేష్ బాబును చూశానని, ఏ పాత్రనైనా అవలీలగా పోషించగల సత్తా మహేష్ బాబుకు ఉందని ఆయన కొనియాడారు. “650 రోజుల నుంచి ఒకే థియేటర్‌లో ఆడుతున్న జూనియర్ ఎన్టీఆర్ సినిమా” సంక్రాంతికి ప్రెస్ మీట్ మహేష్ బాబు అభిమానులు రాజమౌళి ఎటువంటి అప్ డేట్ ఇవ్వడంలేదంటూ విసుగ్గా ఉంటున్నారు. అయితే సంక్రాంతికి ప్రెస్ మీట్ పెట్టి సినిమాకు సంబంధించిన వివరాలు తెలియజేసే అవకాశం ఉందంటున్నారు. ఆఫ్రికన్ అడవుల్లో సినిమా తీయనున్నారని, ఫారెస్ట్ అడ్వెంచర్ గా సినిమా రూపుదిద్దుకోబోతోందని, ఇంతవరకు హాలీవుడ్ లో కూడా రానివిధంగా ఈ సినిమాను రాజమౌళి పట్టాలెక్కించబోతున్నారని తెలుస్తోంది. ఈ సినిమా విజయం సాధిస్తే మహేష్ బాబు హాలీవుడ్ హీరో అయినట్లేనని, ఇంగ్లిషు సినిమాలే చేస్తారని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. ఈ సినిమా తర్వాత మహేష్ బాబు ఎటువంటి నిర్ణయం తీసుకుంటాడా? అనేదే అత్యంత ఉత్కంఠగా సినీ పరిశ్రమలోను, అభిమానుల్లో నెలకొంది.



## విడాకులు తీసుకున్న వ్యక్తితో

# నాని హీరోయిన్ నిశ్చితార్థం

## ఆ ఫొటోలు షూటింగ్‌లో భాగమే

తమిళనాడులో జయం రవికి మంచి క్రేజ్ ఉంది. జయం రవి నుంచి సినిమా వస్తుందంటే మినిమమ్ గ్యారెంటీ ఉంటుందనే విధంగా ఆయన పేరు సంపాదించుకున్నారు. అయితే జయం రవి వైవాహిక జీవితం గురించి గత కొద్ది రోజులుగా అనేక రూమర్స్ వైరల్ అయ్యాయి. జయం రవి ఆర్తిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ జంటకు ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. అయితే వీరిద్దరి మధ్య అభిప్రాయభేదాలు రావడంతో విడిపోవాలని చూస్తున్నారని, విడాకుల కోసం కోర్టును కూడా ఆశ్రయించినట్లు పుకార్లు వచ్చాయి. ఈ పుకార్లను నిజం చేస్తూ ఈ జంట విడాకులు తీసుకున్నారు. అధికారికంగా తాము విడిపోతున్నట్టు జయం రవి తెలిపారు. అయితే విడాకుల గురించి తనని సంప్రదించకుండానే ప్రకటించారని జయం రవి భార్య ఆర్తి ఆవేదన వ్యక్తం చేసింది. జయం రవి ఆర్తిని ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే భార్య నుంచి విడాకులు తీసుకుని పది రోజులు కూడా కాకుండానే జయం రవి మరో అమ్మాయితో క్లోజ్‌గా మూవ్ అవుతూ కనిపించారు. “పెళ్లాం పోర్న్ టార్చర్.. రోజుకు 3 సార్లు నావల్ల కాదంటూ కోర్టుకెళ్లిన భర్త.. చివరికి!” జయం రవి కేనిషా ఫ్రాన్సిస్ అనే సింగర్‌తో రిలేషన్‌లో ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. వీరిద్దరు డేటింగ్ చేస్తున్నారని రూమర్స్ తెర మీదకు వస్తున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో జయం రవి, హీరోయిన్ ప్రియాంక మోహన్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీరిద్దరు పెళ్లి దుస్తుల్లో కనిపించారు.





# సాయి ధరమ్ తేజ కెరీర్‌లో బిగ్ ప్రాజెక్టు

విరూపాక్ష వంటి బ్లాక్‌బస్టర్ చిత్రం తర్వాత మెగా సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్ నటిస్తోన్న కొత్త చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాను హనుమాన్ వంటి భారీ చిత్రాన్ని అందించిన నిర్మాతలు కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా.. ప్రపంచ రికార్డులను బద్దలుకొట్టిన ఓ హాలీవుడ్ సినిమా రీమేక్ అని తెలుస్తోంది. ఇంతకీ ఆ మూవీ ఏంటి.. తేజ్ ఏమన్నాడంటే.. ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు ‘జాక్ సిండర్’ దర్శకత్వం వహించిన సినిమా ‘300’. యుద్ధం నేపథ్యంలో యుద్ధవీరుల సాహసాల కథ ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచ సినిమా చరిత్రలో సరికొత్త అధ్యాయం. 2006లో రిలీజైన ఈ సినిమాని ఇండియాలోని అన్ని భాషల్లో ఫ్రీమేక్ చేశారు. తాజాగా తెరకెక్కనున్న సాయి ధరమ్ తేజ్ సినిమా కూడా అదే అని వార్తల్లొచ్చాయి. దీనిపై హీరో తేజ్ స్పందిస్తూ.. 300 సినిమా నుండి ఇన్‌స్పైర్ చెందే ఈ సినిమాని రూపొందిస్తున్నామన్నారు. తేజ్ కెరీర్‌లోనే ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమాని 120–130 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నట్లు సమాచారం.

**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District, Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com